క్లుప్తంగా

11న మండల సమావేశం

పుల్లంపేట : ఈనెల 11వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ మహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వినయ్ కుమార్‌కు పురస్కారం


పురస్కారాన్ని అందుకొంటున్న వినయ్‌కుమార్

రాయచోటి టౌన్ : రాయచోటికి చెందిన అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ వారు పురస్కారం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం 11వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లంబోదర కల్చరల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేశారు. ఈ పురస్కారాన్ని వినయ్ కుమార్ తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, వెంకటేశ్వర్లు చేతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అకాడమీ ద్వారా అందించే పురస్కారాన్ని తల్లిదండ్రుల చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా విలియంరాజు


బాధ్యతలు చేపట్టిన విలియంరాజును సన్మానించిన దృశ్యం


సిద్దవటం : సిద్దవటం మండల ఇన్‌చార్జి ఎంఈఓగా కె.విలియం రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అట్లూరు మండల విద్యాశాఖ అధికారి-1 విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు సిద్దవటం మండల విద్యాశాఖ అధికారి-2 అరుణ, జిల్లా టోఫెల్ నోడల్ అధికారి, వంతాటిపల్లె ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం డి.వి ప్రసాద్‌రెడ్డి, వివిధ ఉపాధ్యాయ బృందాలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యా ప్రగతికి శాయశక్తుల కృషి చేస్తానని ఆయన తెలిపారు.

అన్నదానం


అన్నదాన కార్యక్రమం నిర్వహించిన దాతలు

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అరవ శ్రీధర్ విజయం సాధించినందుకుగాను రాళ్లచెరువుపల్లి జీవన జ్యోతి ఆనందనిలయం అనాథాశ్రమంలో గురువారం అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బెస్తపల్లి, రాళ్లచెరువుపల్లి గ్రామాలకు చెందిన కూటమి నాయకులు బొక్కసం సురేష్, చింతా విశ్వనాథ్, సుధాకర్ ఆచారి, మధ్యాహ్నం అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించారు. కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం సాధించినందుకు గాను ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.

సాయినాథునికి పూజలు


అలంకారంలో సాయినాథుడు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వాములవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం చేయించారు. అనంతరం భక్తులందరూ అర్చనలు, పూజలు నిర్వహించి స్వాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ధన్యవాదాలు


అరిగె రాంప్రసాద్

నందలూరు : ఎన్డీఏ కూటమి విజయం కోసం పాటుపడిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు బీజేపీ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ అరిగె రాంప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి విజయాన్ని ఇచ్చారని, దురదృష్టవశాత్తు రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం ఓటమి పాలయ్యారని, ఇందుకు గల కారణాలు విశ్లేషించుకుంటున్నామన్నారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు

- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి
- సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలి
- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్


సాగులో ఉన్న వేరుశనగ పంట

రాయచోటి : వేరుశనగ సాగులో మేలైన యాజమాన్యం పాటించితే మంచి దిగుబడి పొందేందుకు వీలుంటుందని అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ తెలిపారు. మేలైన యాజమాన్య పద్ధతులు, విత్తనాలపై ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు నిర్ధారించారని గురువారం సాక్షితో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. నూనె గింజల పంటల్లో ప్రధానమైన పంట వేరుశనగ ముందుందన్నారు. జిల్లాలో రైతులు అధిక విస్తీర్ణంలో వర్షాధారంగా వేరుశనగను సాగు చేస్తారు. ప్రాంతాన్ని బట్టి ఆయా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఖరీఫ్ వేరుశనగను జూన్ నుండి ఆగస్టు వరకు సాగు చేస్తారు.

నూతన రకాలు....

పాత రకాల స్థానంలో ప్రస్తుతం అధిక దిగుబడి నిచ్చే అనేక నూతన రకాల విత్తనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అయితే సాగులో మేలైన యాజమాన్యం పాటించినట్లైతే మంచి దిగుబడి పొందేందుకు వీలుంటుందన్నారు. ఖరీఫ్‌లో వర్షాధారంగా వేరుశనగ పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. రాయలసీమ వ్యాప్తంగా కొత్త రకం వంగడాల విత్తనాలను ఎక్కువగా చేస్తారు. ముఖ్యంగా ఈ పంటకు ఇసుక, గరప నేలలు ఉండి కొద్దిపాటి నీటి వసతి ఉన్న ప్రాంతాలు అనుకూలమన్నారు. అయితే కొంతమంది రైతులు ఇంకా పాత రకాలనే సాగు చేయటం వల్ల ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నారని తెలిపారు. దీనికితోడు తరచూ తుపాన్ల బెడద వల్ల దిగుబడి తగ్గుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ వేరుశనగలో అధిక దిగుబడిని పొందాలంటే రకాల ఎంపిక మొదలు పంట మార్పిడి వరకు, ఎప్పటికప్పుడు తగిన యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందన్నారు.

భూసార పరీక్షలు..

భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు మోతాదును నిర్ణయించుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎరువులను అతిగా వాడరాదన్నారు. సిఫార్సు మేరకు సమయానికి ఎరువులు వేయాలన్నారు. ఇటు సూక్ష్మ పోషక లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నాణ్యమైన దిగుబడులను పొందేందుకు అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు.

8 నుంచి మంచాలమ్మ తిరునాల ఉత్సవాలు


ప్రత్యేక అలంకారంలో మంచాలమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ, పింఛా కుడికాలువ గట్టుపైన వెలసిన శ్రీ మంచాలమ్మ తిరునాల ఉత్సవాలు ఈనెల 8వ తేదీ శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సుబ్బరాయుడు తెలిపారు. రామస్వామి రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని, అలాగే ఉదయం మహాగణపతి పూజ, స్వస్తిహవాచనం, కలశస్థాపన, అమ్మవారికి అభిషేకం, తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు కురవపల్లి నుండి దేవరమొద్దును గుడికి తీసుకువచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. 9వ తేదీ ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీ ఉదయం సోమవారం అమ్మవారికి అభిషేకం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే రాత్రి 9 గంటలకు హరికథా కాలక్షేపం, మొక్కుబడులలో భాగంగా భక్తులు ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలుచే మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య చాందినీ బండ్లతో తిరునాల అత్యంత వైభవంగా జరుగుతుందని, కావున భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

స్పాట్ వాల్యుయేషన్ ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీ


ఉపాధ్యాయులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న పీఈటీ సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : 10వ తరగతి సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు ఏపీ పీఈటీ, ఎస్‌ఏ,(పీఈ) జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. రాయచోటి బాలికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు డీఈఓ శివ కుమార్‌రెడ్డి అనుమతితో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, నరసరాజు, లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, ఉమాదేవి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస రాజులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి


ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా పరిధిలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులు (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎంపికైన ఆయనను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మీ సమస్యలను తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆకేపాటికి సన్మానం


ఆకేపాటిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : రాజంపేట అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని గురువారం బద్వేలులో ఘనంగా సన్మానించారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో బద్వేలు మీదుగా రాజంపేటకు వెళుతున్న ఆయనను స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులోని బంగారు శీనయ్య ఆసుపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు శీనయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఈగయద్దారెడ్డిలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోలా కొండయ్య, యువజన విభాగం నాయకులు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన ఆణిముత్యాలు


బి.నేహారెడ్డి


తేజ


ఆకాష్‌ను అభినందిస్తున్న తాత డాక్టర్ చలమయ్య

రామాపురం : నీట్ యూజీ (ఎంబీబీఎస్) 2024 ఫలితాలలో మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం కస్పాకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బండపల్లి శ్రీరాములు రెడ్డి మనుమరాలు, అన్నమయ్య జిల్లా మన జనప్రగతి జిల్లా ఇన్‌చార్జ్(విలేకరి) బండపల్లి మధుసూదన్‌రెడ్డి, మేఘనల కుమార్తె బండపల్లి నేహారెడ్డి 670 మార్కులు సాధించి ఆల్‌ఇండియా ఈడబ్ల్యూఎస్ విభాగంలో 1,651 ర్యాంక్‌ను సాధించింది. కృషి, పట్టుదలతో విజయవాడలోని శ్రీగోస్ లైట్స్ కళాశాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని 670 మార్కులు సాధించి అటు తల్లిదండ్రులకు, తను కోచింగ్ తీసుకున్న ఉపాధ్యాయ బృందానికి సంతోషాన్ని నింపింది. ఈ సంవత్సరం జరిగే ఆల్ ఇండియా కౌన్సిలింగ్ విభాగంలో ఎయిమ్స్ కాలేజీలో సీటు సంపాదిస్తానని బండపల్లి నేహా రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేసింది.

ప్రతిభ చాటిన తేజ

రాజంపేట : పట్టణంలో బాలాజీ నగర్‌కు చెందిన సంగరాజు తేజ నీట్‌లో తన ప్రతిభను చాటుకున్నారు. 623 మార్కులు సాధించారు. ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణరాజు కుమార్తె తేజ విజయవాడ చైతన్యలో ఇంటర్ విద్యను అభ్యసించారు. ఈ విద్యార్థినికి ఆల్ ఇండియా 55409 ర్యాంకు వచ్చింది. దీంతో కుటుంబంలో సంతోషం వ్యక్తం చేశారు.

మెరిసిన పుల్లంపేట విద్యార్థి

పుల్లంపేట : మండలానికి చెందిన మాధవి, జయకృష్ణ దంపతుల కుమారుడు ఆకాష్ ఇటీవల విడుదలైన నీట్ పరీక్షా ఫలితాలలో 690 మార్కులు సాధించి 4600 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించారు. ఆకాష్‌ను కుటుంబసభ్యులు, మిత్రులు అభినందించారు.

ఏపీకి ప్రత్యేక హోదా తీసుకురావాలి

మదనపల్లె: టీడీపీ అధికారంలోకి వస్తే మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని చెప్పినందుకే ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, హామీని నిలబెట్టుకునే దిశగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా కృషిచేయాలని బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ కోరారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా బీఎస్పీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను నిలిపిందన్నారు. బహుజన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నికల్లో పోటీ చేసిందన్నారు. రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికంగా దాడులు, అల్లర్లు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి ధోరణులు మంచివి కావన్నారు. టీడీపీ నాయకులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలపై కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టి పాలన సాగించాలన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మదనపల్లెను జిల్లా చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

బీఎల్‌ఓలకు గౌరవ వేతనం చెల్లించాలి


డీటీ రెడ్డన్నకు బీఎల్‌ఓలతో కలసి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేత సిద్దిగాళ్ల శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె : 2024 సార్వత్రిక ఎన్నికల్లో నిరంతరం సేవలందించిన బూత్ స్థాయి అధికారులు బీఎల్‌ఓలకు గత రెండు సంవత్సరాలుగా గౌరవ వేతనం చెల్లించలేదని, వీరికి వెంటనే గౌరవ వేతనం చెల్లించాలని అన్నమయ్య జిల్లా ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్నకు బీఎల్‌ఓలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సవరణ నుంచి ఓటర్ల తుది జాబితా వరకు పనిచేసిన బీఎల్‌ఓలకు ఎన్నికలు అయిపోయి కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్నా వారికి రావాల్సిన జీతభత్యాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల విధులలో పాల్గొన్న బూత్ స్థాయి సిబ్బందికి నగదు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బూత్ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కార్పెంటర్ల కాలనీలో నిర్మాణాలు నిలిపివేయండి

పీలేరు : మదనపల్లె మార్గంలోని కార్పెంటర్ల కాలనీలో నిర్మాణాలు నిలిపివేయాలని తహసీల్దారు మహబూబ్ బాషా అన్నారు. తహసీల్దారు మాట్లాడుతూ కాలనీలో నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో తాము పరిశీలించినట్లు తెలిపారు. రికార్డులు చూసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్‌ఐ చాణక్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరాలు


శిక్షణ శిబిరంలో విద్యార్థులు

రామాపురం : గత నెల రోజులుగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం వేసవి శిక్షణా శిబిరాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చిన దృష్ట్యా సమయం వృథా కాకుండా ఉండేందుకు గ్రంథాలయంలో వేసవి శిబిరాలను ఏర్పాటు చేశామని గ్రంథాలయం అధికారి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్రీడలతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రతి గ్రంథాలయానికి ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడంతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో సెల్‌ఫోన్లు లేనప్పుడు చాలా మంది గ్రంథాలయాలకు వచ్చి చదువుకోవడంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానికుల ఫిర్యాదుతో అధికారుల్లో చలనం


జేసీబీతో బస్టాండ్‌ను శుభ్రం చేయిస్తున్న అధికారులు

చిట్వేలి : అపరిశుభ్రతగా ఉన్న చిట్వేలి ఆర్టీసీ బస్టాండ్‌ను అధికారులు గురువారం ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ఈ మేరకు ప్రాంగణంలోని బస్సులు రాకపోవడం, పిచ్చి మొక్కలు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా ఉన్న పరిస్థితిని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన అధికారులు ఆర్టీసీ రక్షణ అధికారి సంజీవ రాయుడు ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేసి నేటి నుంచి బస్సులు రాకపోకలకు వీలు కల్గించామని సంజీవరాయుడు తెలిపారు. బస్టాండ్ పరిసరాలు శుభ్రం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ పెరటిలో మొక్కలు పెంచండి

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్‌లలోని పెరటిల్లో మొక్కలు పెంచాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పందిళ్లపల్లె పంచాయతీలోని తాటిమాకులపల్లె అంగన్‌వాడీ సెంటర్‌లో పెరటిమొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సెంటర్ పరిధిలో కూరగాయ మొక్కలు టమాటా, చిక్కుడు, పచ్చిమిరప, బెండ వంటి కాయగూర మొక్కలను నాటుకుంటే మంచిదన్నారు. దీంతో పిల్లలకు మంచి ఆకుకూరలు వండిపెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ హైమావతి, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవునికి పూజలు

కడప కల్చరల్ : నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాలు గ్రామంలో గల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా తొలుత స్వామి మూలమూర్తికి అభిషేకం, అష్టోత్తర సేవ, కుష్మాండ దీపారాధన పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా గుమ్మడికాయలు సమర్పించి ప్రత్యేకంగా దీపాలు వెలిగించారు. అనంతరం సామూహిక పూజలు చేశారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మేరువ బాలాజీరావు బృందం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బోర్డులు సరే.. సమాచారమేది?

గుర్రంకొండ మార్కెట్ యార్డులో టమాటా ధరలను సూచించే సమాచార బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పరిసర ప్రాంతాల మార్కెట్ యార్డుల్లో ఎంతమేరకు టమాటా ధరలు ఉన్నాయో ప్రతి రోజూ సమాచార బోర్డులో నమోదు చేయాల్సి ఉంది. అయితే అక్కడ ఎలాంటి ధరల సమాచారం లేక పోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

- మార్కెట్ యార్డులో కానరాని టమాటా ధరలు
- ఖాళీగా దర్శనమిస్తున్న ధరల సమాచార బోర్డులు


మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట డిజిటల్ బోర్డులో సమాచారం లేని దృశ్యం



గుర్రంకొండ మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన బోర్డులో ధరల సమాచారం

గుర్రంకొండ : స్థానిక మార్కెట్ యార్డులో టమాటా ధరలు కనబరిచే బోర్డులు వెలవెలబోతున్నాయి. సాధారణ బ్లాక్ బోర్డుతోపాటు కార్యాలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులోనూ సమాచారం కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి రోజూ మార్కెట్ యార్డులో టమాటా వేలం పాట నిర్వహించే సమయానికి వివిధ పట్టణాల్లోని మార్కెట్ యార్డుల్లో ధరలు ఆయా బోర్డుల్లో కనబరచాల్సి ఉంది. అయితే అధికారులు ఆమేరకు జాబితా తయారు చేయడం లేదు. రైతులు ముందుగానే వచ్చి టమాటా ధరలు తెలుసుకని విక్రయాలపై ఒక అంచనాకు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

డిజిటల్ బోర్డులు వృథా

గత కొన్ని రోజులుగా బోర్డుల్లో ధరల సమాచారం కరువైంది. మదనపల్లె, కలికిరి మార్కెట్ యార్డుల్లోని డిజిటల్ బోర్డులో చుట్టు పక్కల పట్టణాల్లోని యార్డుల్లో టమాటా ధరలు చూపించడం లేదు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో సాయంకాలం నాలుగు గంటల నుంచి టమాటా వేలంపాట మొదలవుతుంది. అప్పటికే పలు పట్టణాలలోని యార్డుల్లో వేలం పాట ముగిసిపోయి ధరలు తెలిసిపోతుంటాయి. గుర్రంకొండ యార్డులో అన్ని మార్కెట్లలోని టమాటా ధరలు వేలం పాటల కంటే ముందే ప్రకటించేవారు. అయితే కొద్ది రోజులుగా ఈ తతంగం జరగడంలేదు. బోర్డులు కేవలం దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందిచి సమాచారం పొందుపరచాలని రైతులు కోరుతున్నారు.

ధరలు తెలియజేస్తాం



యార్డులోని సమాచార బోర్డుల్లో టమాటా ధరలు రైతులకు అందుబాటులో ఉంచుతాం. రెండు చోట్ల సమాచార బోర్డులు ఏర్పాటుచేశాం. కార్యాలయం వద్ద డిజిటల్ సమాచార బోర్డులు ఉంచాం. కొన్ని నెలలుగా వినియోగంలోకి రావడంలేదు. ఇక మీదట సమాచారం ప్రతి రోజూ బోర్డుల్లో ఉంచుతాం.

\- కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

ఘనంగా శని జయంతి ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం శని జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శివాలయం అర్చకులు పట్టాభిరామయ్య శనీశ్వరుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం నవగ్రహాలను అభిషేకించి, హోమం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదానం నిర్వహించారు.

సాయి శనీశ్వర ఆలయంలో..

కడప కల్చరల్ : శనీశ్వరస్వామి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్కేనగర్‌లోగల శ్రీ సాయి శనీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, మూలమంత్ర జపం, నవగ్రహారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా శనీశ్వర శాంతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూర్తికి నువ్వులనూనెతో విశేష అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు నువ్వుల నూనెతోపాటు నల్ల నువ్వులను స్వామికి సమర్పించారు. ముదురు ఎరుపురంగు పూలతో పూజించారు. మధ్యాహ్నం భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.